ప్రేమపాశం

(అనువృత్తము)

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

మూడోరంగం

[నూతిపెరట్లో రాచవుసిరిచెట్టుకింద ప్రకాశం కూచునివుంటాడు. కాంతమ్మ నుంచునివుంటుంది.]

కాంతమ్మ—గడుసుదికనక రత్తమ్మవొదిన కదిపి వెళ్లిపోయింది. చాలాఆశగానేవుంది.

ప్రకాశం—ఆశ్చర్యమా అక్కయ్యగారూ? అయిదుయకరాలభూమి, పైగా యకరం నారింజతోట, యకరం కొబ్బరితోట, యకరం నిమ్మతోట, సందుకుపెట్టెలాంటిమేడ. పిల్ల చక్కనిచుక్క. యేంలోటూ?

కాంతమ్మ — అన్నీవున్నాయి. ఆనుహోరాజే గొంతుకోశారు. భూమ్మీద యేదీవుండిపోదండీ. అన్నీ అయిపోతాయి. బంగారం పెళ్లిఆగదు. ఆవేళకెవరో దానికి తగినవాడు—తగినా తగకపోయినా ఘటనవున్నవాడు—

ప్రకాశం—ఎవరిఅదృష్టం బాగుందో చెప్పలేము. రత్తమ్మగారు సరేకదా? కోటమ్మగారు మొదటే బేరం మొదలుపెట్టిందాయె. ఆర్యాపురంలో వొకబట్టలవర్తకుడు ఆశచూపించాడు మొన్న.

కాంతమ్మ—యెవరికిచ్చినా చిట్టితల్లిని విడిచివుండలేనండీ అన్నయ్యగారూ!

ప్రకాశం—ఎందుకువుండాలీ అసలూ. అల్లుణ్ణి యింటోకే తెచ్చుకోవచ్చు.

కాంతమ్మ—అదే చూస్తున్నానండీ.

ప్రకాశం—మీవుద్దేశం యేమిటి అక్కయ్యగారూ?

కాంతమ్మ—యిప్పటికేమీలేదు. నాకాధ్యానమే నిలవడంలేదూ. ప్రపంచకం యేమీ తెలవడంలేదండీ.

ప్రకాశం—ఆశ్చర్యమా అమ్మా? కాని బంగారానికి యీడువచ్చింది. ఇక ఆపడానికివల్లకాదు.

కాంతమ్మ— పెనిమిటిపోవడనూ, కూతురుపెళ్లీనీ. చూశారా అన్నయ్యగారూ? ఎలాగాభరించడం?

ప్రకాశం—గోరుచుట్టుమీద రోకలిపోటన్నట్లు-యేంచెయ్యగలనూ? అనుభవించడంతప్ప వేరేదారిలేదు.

(అప్పుడు బంగారమ్మవస్తుంది)

బంగారమ్మ—వెంకమ్మత్తగారు భోజనంచేసీదాకా విడిచిపెట్టారుకారు. ఈపూట యిక అక్కల్లేదే అమ్మా!

కాంతమ్మ—పోనీలేఅమ్మా! ఒదిన నువ్వంటే ప్రాణంయిస్తుంది. అన్నయ్యగారిసంగతి చెప్పనేఅక్కర్లేదూ.

ప్రకాశం—ఇలారాకోడలా!

కాంతమ్మ— మామయ్యగారిదగ్గిర కూచో అమ్మా!

బంగారమ్మ—ఎందుకండీ మామయ్యగారూ? (అంటూ ప్రకాశందగ్గిర కూచుంటుంది.)

ప్రకాశం—మీరాయడుబావ తెచ్చిన మితాయి అంతా తినేశావా, కొంచెంవుంచావా?

బంగారమ్మ — బాగుందికాదండీ. బ్రాహ్మణదుకాణంలోది కాదుట. నిలవసరుకులా వుంది, చూస్తారా?

ప్రకాశం—అంటే?

బంగారమ్మ—పుచ్చుకుంటారా?

ప్రకాశం—బాగుంటే పెట్టకేపోదువు.

బంగారమ్మ — పెట్టకపోడానికి బాగుండడం యేదీ? పాకరకం చూశాడు రాయడుబావ: కాక పోయినా బజారునుంచితెచ్చింది తింటారు కామోసు మీరు.

ప్రకాశం—మిఠాయికేంగానీ; రాయడుబావ బాగున్నాడా కోడలా?

కాంతమ్మ—రాయడుబావ బాగున్నాడా, వెంకన్నబావ బాగున్నాడాతల్లీ?

బంగారమ్మ—వాళ్లిద్దర్నే అడిగావేం?

కాంతమ్మ—అదోజట్టూ. వెంకన్న పోకుండలు తెచ్చాడు. రాయడు మిఠాయితెచ్చాడు.

ప్రకాశం—ఇంకాయెవరున్నారూ అడగడానికి?

బంగారమ్మ—యెవరేనా వుంటారు.

ప్రకాశం—అడిగినవాళ్ల సంగతి చెప్పమంటే యెవరో వున్నారంటావేం?

కాంతమ్మ—అడిగినదానికి జవాబుచెప్పుతల్లీ!

బంగారమ్మ—యిద్దరికీ తేడావుంది.

ప్రకాశం—ఏమిటది?

కాంతమ్మ—మాతల్లి చాలాదూరం ఆలోచిస్తుందండీ. సరిగ్గాచెప్పమ్మా.

బంగారమ్మ—మట్టిబెడ్డవొకటీ, గాజుపూసవొకటీనీ.

ప్రకాశం—అంటే?

బంగారమ్మ—కొండముచ్చువొకటే, పండుకోతివొకటీనీ.

ప్రకాశం—అసలే తెలవలేదూ.

బంగారమ్మ—గాడిదవొకటీ, గుఱ్ఱంవొకటీనీ.

కాంతమ్మ—అదేమిటితల్లీ? తెనిగించిచెప్పమ్మా.

బంగారమ్మ—ఏంవుందనిచెప్పమంటావే? పీనుగువొకటీ, ఏనుగు వొకటీనీ.

ప్రకాశం—ఏనుగు మంచిదేకదూ?

బంగారమ్మ—సింహందగ్గిర యేనుగు తీసికట్టు కాదుటండీ మామయ్యగారూ?

ప్రకాశం—సింహంయెవరూ?

బంగారమ్మ—మీరిద్దర్నే అడిగారు ముందు.

కాంతమ్మ—దొరకదు మాఅమ్మ.

ప్రకాశం—ఇప్పు డడుగుతున్నాను. సింహం యెవరోచెప్పు.

బంగారమ్మ—ఎందుకోసమోచెప్పండి.

కాంతమ్మ—రాయడుబావని పెళ్లాడతావా తల్లీ?

ప్రకాశం—పోనీ, వెంకన్న బావనో?

బంగారమ్మ—(చురచురచూస్తూ కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటుంది.)

ప్రకాశం—అదేమిటి బంగారం? కోపం వచ్చిందా? యేం?

బంగారమ్మ—నాకర్మం (దుఃఖిస్తుంది.)

కాంతమ్మ—అడిగింది యిష్టమోకాదో చెప్పాలిగాని యేడుస్తారాతల్లీ? ఇలారా అమ్మా!

(తెరలో: 'బంగారం! తలుపు')

బంగారమ్మ—మా పేరుభట్టుబావతో చెబుతానుండండి. (కళ్లు నులుముకుంటూ వెళ్లిపోతుంది.)

కాంతమ్మ—చూశారా అన్నయ్యగారూ?

ప్రకాశం—నాదేతప్పూ. అందమూ చందమూ, కష్టమూ సుఖమూ, మంచీచెడ్డా తెలిసినపిల్ల. తారతమ్యం బాగాకనిపెట్టింది. వెంకన్న పీనుగూ, రాయడు యేనుగూనా? పైగా సింహంవుందా? అతగాడెవరూ? కనిపెట్టారా అక్కయ్యగారూ?

కాంతమ్మ—పేరుభట్టేనండీ.

ప్రకాశం—అవునవును. సందేహం లేదు. మనం చేసిన నేరం అతనితో చెబుతుందిట. యెంతతీవ్రమైన ఆఘాతమూ? అక్కయ్యగారూ! కోడలు చూపు మంచిచోటేపడింది. సుఖపడుతుంది.

కాంతమ్మ—ఏమంటారన్నయ్యగారూ?

ప్రకాశం—ఆలోచించవద్దు.

కాంతమ్మ—మీరేదిక్కు నాకూ నాబిడ్డకీనీ.

ప్రకాశం—అందరికీదిక్కు భగవంతుడున్నాడు. మరోసమ్మంధం చూడవద్దు.

కాంతమ్మ—మీయిష్టం.

ప్రకాశం—వాళ్ల సంభాషణ వినాలి.

కాంతమ్మ—పదండి.

(ఇద్దరూ వెడతారు)

నాలుగోరంగం

[బంగారమ్మ తలుపుతీస్తుంది పేరుభట్టు లోపలికి వస్తాడు.]

పేరుభట్టు—మొగం అలావుందేం? ఏంబంగారం అలావున్నావేం?

బంగారమ్మ—(మొగముపంచుకుని దుఃఖిస్తుంది)

పేరుభట్టు — అదేమిటిబంగారం? (ఆమెని పొదివిపట్టుకొని అక్కడవున్న బల్లమీదకూచుని ఆమెని కాళ్లలో యిరికించుకొని మురిసర్లు దువ్వుతూ) ఊరుకో. యెందుకేడుస్తావూ?

బంగారమ్మ—(మరింత దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—చూడూ! ఇంతదుఃఖం యెందుకు వచ్చిందీ? ఎవరేంచేశారూ?

బంగారమ్మ—మాఅమ్మ, ప్రకాశంమామయ్య గారూ—

పేరుభట్టు—ఏంచేశారూ?

బంగారమ్మ—మాఅమ్మ రాయణ్ణిపెళ్లాడతావా అంది. వెంకన్నని పెళ్లాడతావా అన్నారు మామయ్య గారు.

పేరుభట్టు—అయితే?

బంగారమ్మ—ఏడుపువచ్చింది.

పేరుభట్టు—వారలాఅడిగితే ఆడతాననో, ఆడ ననో కచ్చితంగా చెప్పెయ్యాలిగాని యేడవడం యెందుకూ?

బంగారమ్మ — నన్ను వెంకణ్ణి పెళ్లాడమంటారా?

పేరుభట్టు —అంటే?

బంగారమ్మ—ఛా! వెంకన్న చచ్చుపెద్దమ్మ. రాయడు—మొగంనిండా స్ఫోటకంమచ్చలూ వాడూ గంటేసిన తిరగటిరాయిలాగ యేంబాగున్నాడూ?

పేరుభట్టు—నాకక్కర్లేదని చెప్పలేకపోయావా యిష్టం లేకపోతే?

బంగారమ్మ—వాళ్లకి తెలవగూడదూ?

పేరుభట్టు—వేళాకోళాని కన్నారేమో.

బంగారమ్మ-ఇలాంటిదా వేళాకోళం అంటేను?

పేరుభట్టు—(స్వగతం) బంగారాని కిష్టంలేదు కనక మనకి వెంకన్నపోటీగాని, రాయడుపోటీగాని వుండకపోవచ్చు. అయితే వాళ్లపోటీ లేకపోతేమాత్రం నామీద యిష్టంకలగవద్దూ?......ఇదంతా యిష్టం లోనే జమఅవుతుందా?......ఒకబెంగ తీరింది. చివరికి అన్నిబెంగలూ ఇలాగే తీరిపోగూడదూ?

బంగారమ్మ—బావోయి! వోమాటు వెంకన్న నన్ను పెళ్లాడతానంటూ (నవ్వుతూ) పో-కుం-డ-

పేరుభట్టు—ఏంచేశావూ?

బంగారమ్మ—పోకుండలు (నవ్వి) నాకోసమే తెచ్చాట్ట. హిహిహీ. అవ్వేమిటిబావా?

పేరుభట్టు—అది పూర్వకాలపు పిండివంట. ఇప్పుడది తీసికట్టు. అప్పుడు నువ్వేంచేశావూ?

బంగారమ్మ—"పో అవతలికి. ఇంకానుంచుంటావేం" అన్నాను.

పేరుభట్టు—తప్పుగామూ?

బంగారమ్మ—లేకపోతే నన్ను పెళ్లాడతానంటాడేం? చెయ్యి పట్టుకోపోయాడుకూడానూ.

కంయిమనేటప్పటికి అడిలి బేజారై పోయాడు. వాడికి కాళ్లుకడుక్కోడానికి నీళ్లుకూడా యివ్వాలిట నేను.

పేరుభట్టు—పాపం అలసిపోయి వచ్చాడు కామోసు, యివ్వలేకపోయావా ?

బంగారమ్మ—వస్తాడు, వస్తాడు. సిగ్గులేకపోతే సరి.

పేరుభట్టు—సిగ్గెందుకూ బంగారం ?

బంగారమ్మ—మాయింట్లో దాసీదాని కూతురేనా వాణ్ణి పెళ్లాడదు.

పేరుభట్టు—రాయణ్ణో ?

బంగారమ్మ—వూరుకో బావా ! మళ్లీ అడిగావంటే నాకు కోపంవస్తుంది. మామయ్యగారితో యివాళ మాట్లాడను. ఇవాళరాత్రి మాఅమ్మదగ్గిర పడుకోను.

పేరుభట్టు—(ముక్కుమీద వేలుపెట్టుకొని) యెంతతప్పూ ? నువ్విలా చెయ్యవచ్చునా ?

బంగారమ్మ—నన్నలాఅనడమేం?

పేరుభట్టు—వారికి నీమీదకోపమా?

బంగారమ్మ—కోపంకాదు. నిజమే. వేళాకోళం అయితేమాత్రం అలాగాచెయ్యడం?

పేరుభట్టు—నువ్విలా పంతంపట్టుకుని కూచోకూడదు.

బంగారమ్మ—యివాళ అస్తమానూమానేసి, రేపు పొద్దున్న చీకటితోటేవెళ్లి దణ్ణంపెట్టి, యెప్పుడూ అలా అనవద్దని మాట్లాడతానులే.

పేరుభట్టు—నువ్వు నేనుచెప్పినమాట విన్నదేదీ యిందులో?

బంగారమ్మ—వూరుకుందూ బావా నువ్వూ.

పేరుభట్టు—నాతో మాట్లాడ్డంకూడా మానేస్తావాయేమిటి?

బంగారమ్మ—అ-మ్మ-బాబో ! నిన్నుచూడకపోతే నేవుండలేనూ.

పేరుభట్టు—హోయిహోయి ! (గుచ్చికౌగిలించుకొని) దయవుందికనక. అయితే నామాటవినవూ ?

బంగారమ్మ—యింతపట్టు పడుతున్నావేమిటి బావా యివాళా?

పేరుభట్టు—తప్పుకాదూ?

బంగారమ్మ — (చిరునవ్వుతో) పట్టుపట్టడమేనా?

పేరుభట్టు—అవును. మాట్లాడనని.

బంగారమ్మ—అదాఅమ్మా? ఓహో!

పేరుభట్టు—యిలాచూడూ.

బంగారమ్మ—యేం? (చూస్తుంది)

పేరుభట్టు—మాబంగారం నామాటవింటుంది. తీసెయ్యదు. ఆవీధిని అలాచెప్పుకుంటున్నారు.

బంగారమ్మ — వాళ్లబంగారం వొక్కొక్కప్పుడు వాళ్లపేరుభట్టుబావమాట వినకపోవడంకూడా వుందని ఆర్యాపురంలో చెప్పుకుంటున్నారు బావోయి!

పేరుభట్టు—చూశావా ? పోనీ.

బంగారమ్మ—ఆ. పోనీ. పోనీ. మాట్లాడతానులేబావా ! ఏం ?

పేరుభట్టు—నువ్వు నాకు నచ్చినదానవు. మీ అమ్మ నువ్వు మాట్లాడకపోతే అన్నంతింటుందా ? పచ్చిమంచినీళ్లేనా తాగుతుందా? ప్రకాశంగారు యెన్ని విధాల కనిపెడుతున్నారూ ? ఆయనతో మాట్లాడకపోతే కృతఘ్నతకాదూ ?

బంగారమ్మ—మాట్లాడతానన్నాను కాదూ ? ఈదండకంఅంతా యెందుకూ యింకా ?

పేరుభట్టు—అయితేసరే, నేను స్నానంచేసి వస్తా నింటోకిపద.

బంగారమ్మ—నూతిదగ్గిర చెయ్యిబావా ? నేను నీళ్లుతోడతానులే.

పేరుభట్టు—నువ్వు నీళ్లుతోడితే నీచేతులు లాగుతాయి బంగారం !

బంగారమ్మ — నీవుతోడితే యెంతో బాగుంటుంది బావా! ఎన్ని నీళ్లేనా తోడెయ్యగలను యించక్క. మరిలే. సబ్బు తెస్తాను పద నూతిదగ్గిరికి.

పేరుభట్టు—నువ్వువచ్చేదాకా నేను నీళ్లు తోడుతూవుంటాను. ఏం?

బంగారమ్మ—నేనొప్పుకోను, నేనే తోడతాను. నీళ్లుతోడాకే సబ్బు తెస్తాను. రా. (చెయ్యి పట్టుకుంటుంది.)

పేరుభట్టు—తోడుకోనులే, సబ్బుపట్టుకురా.

బంగారమ్మ—(చెయ్యివిడిచిపెట్టి, రెండడుగులు వేసి) తోడుకున్నావంటే నేను వొప్పుకోనుసుమా, నన్ను చంపుకుతిన్నట్లే. వొట్టుపెట్టనా?

పేరుభట్టు—దీనిపేరేమిటో?

బంగారమ్మ—మరినువ్వు తోడుకుంటాననడమేం? (వెళ్లిపోతుంది.)

పేరుభట్టు— (చొక్కా విప్పుతూ) బంగారం భావం యేమిటి? నేను భ్రాంతిపడుతున్నానా? నా దగ్గిర యేం విశేషంవుందీ?.........చివరికేమయినా పెండలాడ్డే అటోయికో తేలిపోతే బాగుండును. (వెళ్లిపోతాడు.)

(అప్పుడు కాంతమ్మా, ప్రకాశమూ వస్తారు)

ప్రకాశం—యెంతకోపంవచ్చిందీ కోడలికీ?

కాంతమ్మ—యేమీ యెరగనిపిల్ల. మరోలాగ అనుకోకండి అన్నయ్యగారూ!

ప్రకాశం—అనుకోడంయెందుకూ? నేనన్నది తప్పుమాటే.

కాంతమ్మ— (చేతులుజోడించి) తండ్రిలేని పిల్ల. తప్పుపట్టుకోకండన్నయ్యగారూ!

ప్రకాశం — అదేమిటక్కయ్యగారూ? ఇందులోతప్పుకి యేంవుందీ? నేనే మాట్లాడిస్తాను ముందు.

(అప్పుడు సబ్బుపెట్టెపట్టుకొని బంగారమ్మ వడిగావస్తుంది)

బంగారమ్మ—పదబావా! (చూసి) మాబావ యేడండీ మామయ్యగారూ?

ప్రకాశం—నేను చూడలేదమ్మా.

బంగారమ్మ—యేమేఅమ్మా?

కాంతమ్మ—నూతికి వెళ్లాడుతల్లీ!

బంగారమ్మ—నీళ్లుతోడుకుంటున్నాడు కామోసు. అలాచేస్తే యెరగడూ? (వెళ్లిపోతుంది.)

కాంతమ్మ—బిడ్డ తప్పుదిద్దుకుంది. క్షమించాలి మీరు.

ప్రకాశం—అలాఅనకూడదు మీరు. బంగారం క్షణక్షణమూ నన్నోడించేస్తోంది. ఏమీ సమాధానం చెప్పలేకుండావున్నాను. నాకు చాలా ఆనందంగా వుంది.

కాంతమ్మ—ఆశీర్వదించండి.

ప్రకాశం—అవశ్యమూనూ. మరి బజారులో పనివుంది వెళ్లివస్తాను.

కాంతమ్మ—వెళ్లిరండన్నయ్యగారూ!

ప్రకాశం—భోజనంచేసి మళ్లీ కనపడతాను లెండి. (వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—(స్వగతం) చిట్టితల్లి వరస యిలా వుంది. (దుఃఖంతో) తండ్రిలేనిపిల్ల అయిపోయింది.

(తెరదించాలి)

అయిదోరంగం

[హాలులో బీరువాపక్కన బంగారమ్మ కూచుని వుంటుంది. గుమ్మంయొక్క సూటిగా చూస్తూ లోపలి తలుపుకేసి వెళ్లేవారికి ఆమెకనపడదు.]

బంగారమ్మ—పాపం నిన్నరాత్రల్లా కష్టపెట్టాను బావని. మొదట బద్ధకించాడు; గాని చివరికి మూడుకాలాలూ ఫిడేలుమీద అలవాటయ్యేదాకా నేర్పాడు పాపం. శ్రీరాగంవర్ణం మాబాగావుంది. ఇది బావపాడితే మరీబాగుంటుంది. అతను ఫిడేలు మీదవాయిస్తే—వూరికే పాకిపోతుంది. బావ యెంత

మంచివాడూ? నాకోసం యెంత కష్టపడుతున్నాడూ? వారాలు చేసుకుంటాడు; కాని యెన్నివిధాల బతిమాలినా—తనే యెదర బతిమాలుతాడుకూడాను. ప్లీడర్లూ, వుద్యోగస్థులూ, భాగ్యవంతులూ పిలిచి భోజనం పెడుతూవుంటే కాళ్లతో తన్నేసుకోడంకానయితే మంచిదికాదు. నిజమే. అయితే కల్లీబొల్లీమంటూ కబుర్లుచెప్పుకుంటూ అతనిదగ్గిరకూచుని తిందామంటే నాకు యోగం లేకుండావుంది. ఎప్పుడో వొకమాటు యీమాట నోరుజారి అనేటప్పటికి లడ్డూ, హల్వా, మైసూరుపాకూ, బాసండీ, జహాంగీరూ—యిలాంటివి తెచ్చి, వొళ్లోకూచోబెట్టుకుని "మరితినూ, కభుర్లు చెప్పూ" అంటూ కవ్వించడం మొదలుపెట్టాడు. యెంతమంచివాడమ్మా బావా? పాటపాడేటప్పుడు ఆ కళ్లు తిప్పుకుంటూవుంటే, ఆకంఠం ఖంగుమనిమోగుతూవుంటే, ఆకథలు చెబుతూవుంటే—బావని విడిచివుండడంకష్టమే.

(అప్పుడు పేరుభట్టు వొకకండువాలచాపు పట్టుకొనివస్తాడు.)

బంగారమ్మ—(స్వగతం) అడుగో బావ. కాస్సేపు మాట్లాడకుండా కూచుంటాను. ఏంచేస్తాడో చూద్దాం. ఆకొత్తబట్టయేమిటో?

పేరుభట్టు—(స్వగతం) ఇంకాభోజనాలు కాలేదు. తలుచుకోండీ యివాళ యీవిందునాకు. కండువాలచాపు చాలామంచిదీ. (చూసి) నేలంకండువాలాయేమిటి? ఆఅడావడిలో మాడ్డేలేదూ తిన్నగాను. భేష్! బంగారానికి వల్లెవాటువేసుకోడానికి మహాబాగుంటాయి! ఇవాళ రథసప్తమికనక యీపండుక్కికూడా యేదో కొత్తవస్తువిచ్చినట్లవుతుంది. బాగానే కుదిరిందిపదకం......ఇచ్చిందాకా తోచదూ. పిలిస్తే తొరగానేనా అన్నంతినివస్తుంది. (తలుపు నెమ్మదిగా తట్టి) బంగారం!

బంగారమ్మ—(స్వగతం) అప్పుడే పలగ్గూడదు.

పేరుభట్టు—(మళ్లీతట్టి) ఓరత్నమాణిక్యం!

బంగారమ్మ—(స్వగతం) ఇంకా యేమంటాడో అననీ. ఏదో తెచ్చాడు. అందుకోసమే యీతొందర.

పేరుభట్టు—ఓవెండీ!

బంగారమ్మ—(స్వగతం) చివరికి తగరంఅనీ, సీసంఅనీ అంటాడేమో కొంపతీసి.

పేరుభట్టు—(మళ్లీతట్టి) మామయ్యకూతురా!

బంగారమ్మ—(స్వగతం) మార్చేశాడు ఇంకా యేమంటాడో?

పేరుభట్టు—(మళ్లీతట్టి) మరదలా!

బంగారమ్మ—(స్వగతం) యిదీ బాగానేవుంది.

పేరుభట్టు—యింటోవున్నట్టా, లేనట్టా?

బంగారమ్మ—(స్వగతం) చెప్పుకో చూస్తానూ.

పేరుభట్టు—బావమరిదీ!

బంగారమ్మ—(స్వగతం) ఇది మరీబాగుంది. ఇకపలికేస్తాను. పాపం బావకి గొంతుకు నెప్పిపెడుతుంది.... పోనీ, యింకాస్సేపు చూస్తాను.

పేరుభట్టు—ఓరేబావా!

బంగారమ్మ—(స్వగతం) ముద్దునుసుపేర్లూపెడుతున్నాడు పాపం. ఇంకోమాటుకూడా చూస్తాను. పోనీ పలికేస్తే? ఉండడం కష్టంగా వుంది......ఇంకా యెంతచక్కనిపేర్లు పెడతాడో పెట్టనీ.

పేరుభట్టు—వోసంగీతపాఠకురాలా!

బంగారమ్మ—(స్వగతం) తనకంటేనా?

(తెరలో)

వాకిట్లో లేదుటోయి?

పేరుభట్టు—లేదత్తా!

(తెరలో)

దొడ్లోవుందేమో యింకోమాటుపిలు. లేకపోతే నేను చూసివస్తానుండు.

పేరుభట్టు—(మళ్లీతలుపుతట్టి) బంగారంపంతులుగారూ!

బంగారమ్మ—(తటాలున లేచివచ్చి) యెందుకండీ పేరుభట్టు శాస్త్రుల్లుగారూ!

పేరుభట్టు—ఇందాకణ్ణుంచీ యెక్కడున్నావు చిలిపిల్లా?

బంగారమ్మ—అప్పుడే చత్వారంవచ్చిందా యేమిటి పెంకిపిల్లాడా?

పేరుభట్టు—ఏంచేస్తున్నావూ మరి పలక్కుండానూ?

బంగారమ్మ—(ఎదటికివచ్చి రెండుచేతులూపట్టుకొని) నువ్వేంచేస్తావో చూద్దామని వూరుకున్నాను బావా! గుట్టుకిపడి వూరుకున్నానుగాని మహాకష్టం అయిందిసుమా! అదేమిటిబావా?

పేరుభట్టు—నీకోసమే తెచ్చాను యీకండువాల చాపు. వల్లెవాటు వేసుకోడానికి బాగుంటాయేమో చూడూ.

బంగారమ్మ—(పుచ్చుకొని చూస్తూ) నిక్షేపంలా వున్నాయి; కాని యెప్పుడూ యేమీ తేవద్దంటే యెందుకు తెచ్చావుబావా?

పేరుభట్టు—కొన్నానా యేమిటి?

బంగారమ్మ—మరెలా వచ్చాయమ్మా?

పేరుభట్టు—ఆవీధిని వొకప్లీడరుగారి కొడుక్కి పెళ్లి. ఇవాళ జామార్లుకట్టుకున్నారు. అవతలా ప్లీడరుగారే, యివతలాప్లీడరుగారే. ఇద్దరికీ నామీద అభిమానమే. వీరు కూడా తీసుకువెళ్లారు. వారు ఆదరించి బహుమతీ యిచ్చారు.

బంగారమ్మ — నువ్వు నాకు బహుమతీ చేస్తున్నావు.

పేరుభట్టు—నువ్వు పరీక్ష చేస్తున్నావు.

బంగారమ్మ—నాకోసం అస్తమానూ డబ్బు ఖర్చుపెడుతూ వుంటే చెయ్యనా యేమిటి?

పేరుభట్టు—చేస్తే చేశావుగానీ, వల్లెవాటు వేసుకురా ముందూ.

బంగారమ్మ—వేసుకుంటానుగాని ఆపెళ్లిలో నువ్వేంచేస్తావు బావా? ఆడపెళ్లివారిలో చేరుతావా, మొగపెళ్లివారిలో కూడతావా?

పేరుభట్టు—రెండువేపులా పెద్దనే నేనూ. అయితే: నాపెళ్లిలో నువ్వేంచేస్తావో చెప్పూచూద్దాం.

బంగారమ్మ—నేనా–నేనా–మరీ–మరీ–

పేరుభట్టు—తొరగా తేల్చూ.

(తెరలో)

నీతో కూడా పెళ్లిపీటమీద కూచుంటుంది.

(సరిగ్గా యీసమయంలో ప్రకాశంవస్తాడు. బంగారమ్మ చెయ్యివిడిపించుకొని యింటోకివెళ్లి పోతుంది.)

ప్రకాశం—ఏంచేస్తావు కోడలా? నుంచో—వెళ్లిపోతావేం?

పేరుభట్టు—ఎంతమంచిమాటా? ఎన్నాళ్లకి వినపడిందీ? ఎంత అనుగ్రహంవచ్చిందీ అత్తకిప్పటికీ? చాలు నాకిది. నేను పుణ్యమే చేసుకున్నాను. నా బంగారం నాకు తక్కింది.

(అప్పుడు కాంతమ్మ బంగారమ్మని చెయ్యిపట్టుకు తీసుకువస్తుంది).

కాంతమ్మ—అంతసిగ్గెందుకే? బావకొత్తవాడా యేమిటినీకు? ఇందాకటిదాకా యెలాంటిబావో యిప్పుడుమాత్రం అలాంటి బావకాదూ పేరుభట్టు నీకూ? "పేరూ" అనివొకమాటూ, "భట్టూ" అనివోమాటూ, "నీపేరు భట్టూ" అని యింకోమాటూ, "మాబావపేరు భట్టూ" అనిమరోమాటూ, "భట్టుపేరు బావా" అని యింకొకమాటూ—యిలాగ చెవులుపట్టుకుని ఆడించేదానవు కాదుటే, ఇప్పుడు సిగ్గుపడతావూ? సమయానికి పిలిచినట్టు మామయ్యగారుకూడా వచ్చారు దణ్ణంపెట్టమ్మా! (అని అతనిదగ్గిరికి తీసుకువెళ్లి) ఇలాఅన్నా నన్నయ్యగారూ! నాబిడ్డ అతనికి తగిందికాదు గానీ—

ప్రకాశం—చాలా మంచిపనిచేశారండీ అక్కయ్యగారూ! వరుడికి తగినవధువూ, వధువుకి తగిన వరుడూనూ. ఇక తాహతా—?

పేరుభట్టు—అదినేను సందేహించవలసిన విష యం. ఎటుచూసినా బంగారానికి నేను తగను—కానీ—

ప్రకాశం—అక్కయ్యగారి మాటా మీమాటా గూడా నాకు లెక్క లేదు. ఏమంటే? మాకోడ లిదివరకి వొకపేనుగునీ, వొకయేనుగునీ యేరిపారేసింది ఇక యెక్కడో సింహంవుందిట. ఆసింహం యెవరో యిప్పుడు తేలాలి. ఏంకోడలా? యేమంటావు? సింహం—

కాంతమ్మ—(మందహాసంతో) చెప్పవేతల్లీ!

బంగారమ్మ—(తలవంచుకొని చిరునవ్వునవ్వి వూరుకుంటుంది.)

ప్రకాశం—చెబితేగాని నేను వొప్పుకోను. ఇది వరకి మాట్లాడితే నన్ను వోడించేసేస్తున్నావు. యిప్పుడు—

కాంతమ్మ—తప్పుకాదుటే అలా వూరుకుంటావూ? చెప్పమ్మా!

బంగారమ్మ—(అలాగే చిరునవ్వు నవ్వుతూ వొకమాటు మొగంయెత్తి ప్రకాశానికి నమస్కారంచేసి మళ్లీ తలవంచుకొంటుంది.)

ప్రకాశం—ఇందాకా మీఅమ్మగారు దణ్ణం పెట్టమన్నందు కిప్పుడైనా పెట్టావు. సంతోషమే. కాని చెప్పేదాకా నేను వొప్పుకోను.

కాంతమ్మ—పోనీ, చెప్పలేకపోతే చూపించు తల్లీ!

బంగారమ్మ—(చిరునవ్వుతో పేరుభట్టుకేసి చూసి మళ్లీతలవంచుకొంటుంది.)

ప్రకాశం—అన్నా! ఎంతదానవై నావుకోడలా? ఎక్కడ, యెప్పుడు నేర్చుకున్నావూ ఈసిగ్గంతానూ? వెంకన్నబావని కంయిమని కసిరినప్పు డీసిగ్గంతా యేమై పోయిందీ?

కాంతమ్మ—అన్నయ్యగారూ! మీకుసమాధానం చెప్పగలదా నాబిడ్డా?

ప్రకాశం—ఇంతకంటే యేం చెప్పాలీ? యెవరు చెప్పగలరూ? చాలామంచిపని చేశారు మీ రక్కయ్య గారూ! ఈమాట వినడానికి నేను చాలారోజులనుంచి యెదురుచూస్తున్నాను. పేరుభట్టుగారు మీయింటికి మొట్టమొదట భోజనానికి ఉండిపోయినరాత్రి బావ గారూ నేనూ యీమాటే అనుకున్నాం. బావగారి వుద్దేశాన్ని మీరు అక్షరాలా నెరవేర్చారు.

కాంతమ్మ—ఆయనవుంటే యెంతఅందంగా వుండు నన్నయ్యగారూ యిప్పుడూ! బిడ్డ కెన్ని ముచ్చట్లు తీరును? అంత అదృష్టం నాకు లేందే తండ్రీ!

పేరుభట్టు—నామాట చెప్పండి బాబుగారూ! మావాళ్లకీ మామామయ్యగారికీ చాలారోజులనుంచి మాట ల్లేవు. నేను విజయనగరంలోనూ, అక్కడా వుండి పోయాను కనక విరోధంతో సంబంధం లేకపోయినా— దూరదృష్టి లేకపోవడంచేత యీవూళ్లో వుండికూడా— బంగారం ఆవేళపిలవడం యిలాంటి అదృష్టం నాకు సంభవిస్తుందనడానికి సూచనకామోసు—

కాంతమ్మ—పేరుభట్టు పిలవగానే వస్తాడని మాకెంతమాత్రమూ నమ్మకం లేదు. తీరా పిలిస్తే చిన్న పుచ్చుకోవలసివస్తుందేమోనని బిడ్డని వద్దనికూడా మేం బోధించాం; కాని అది—

పేరుభట్టు—బంగారం పిలిచినప్పుడు సుమ్మం లోకి రావడానికి మొదట నాకు మొగంచెల్లిందికాదు. ఏమంటే? మొదట నేను పలకరించవలసినవాణ్ణి. అలా చెయ్యనందుకు సిగ్గుపడిపోయి తటపటాయించాను. మామయ్య నన్ను పిలిచి సిగ్గుపోగొట్టాడు కనక—యింతకీ అప్పుడు బంగారం నన్ను తానై పిలవడం వరంయిచ్చిన ట్లుంది.

ప్రకాశం—నిజంగా యీసంతోషం అంతా నాదీ. ఏమంటే? బంగారాన్ని పెళ్లాడ్డాని కనేకమంది వువ్విళ్లూరుతున్నారు. కోటమ్మగారి మాటకేంగాని రత్తమ్మగారు తపస్సే చేస్తున్నారు. ఇంకా యిద్దరు ముగ్గురు నాస్నేహితులుగూడా వూగిసలాడుతున్నారు; గాని భగవంతుడు మీయిద్దరికీ ఘటనకూర్చాడా లేదా అని నేను తహతహలాడిపోతున్నాను. ఇంకోపిల్ల మీకు

పనికిరాదు. ఇంకోపిల్లాడు బంగారానికి పనికిరాడు. మీదాంపత్యం దేవతలికికూడా లోభంపుట్టించగలదు.

కాంతమ్మ—అన్నయ్యగారూ! మీబావగారి వుద్దేశం నేను చాలామట్టు గ్రహించాను. ఆయన యీ సంగతి నన్ను మనస్సులో పెట్టుకోమన్నారు. అయితే పేరుభట్టువొప్పుకుంటాడో వొప్పుకోడో—

పేరుభట్టు—బంగారాన్ని తిరస్కరించడంఅంటే మానవత్వం లేదన్నమాట. హృదయంగలవాడెవడూ నీకూతుర్ని వద్దనలేడు. పైగా మీసపాటివారి మర్యాదని గురించీ, ఔదార్యాన్నిగురించీ, సాంప్రదాయాన్ని గురించీ యెవరికీ సందేహాలుపుట్టవు. బాబుగారూ! నిజంచెబుతున్నాను నేను. రాయుడుకోసం మారత్తమ్మ పిన్నీ, వెంకన్నకోసం మాకోటమ్మదొడ్డమ్మా చేసే ప్రయత్నాలు నేను చాలామట్టు చూశాను. దాంతో నాకు మనస్సుమనస్సులో వుండటంలేదు. బంగారం యెక్కడ పైకిదాటిపోతుందోఅని నేను నిద్రాహారాలెరక్కుండా తపించిపోతున్నాను.

కాంతమ్మ—నాయనా! ఏంచెప్పనూ? నేనేం చెప్పగలనూ? దిక్కులేనివాళ్లకిలాంటి కోరిక లుండకూడదు. నిజంచేత తాహతుమాలినపరుసులు మంచివి కావుగాని—అయినా ఆశకి అంతమూ తారతమ్యమూ తెలవదుకామా? కట్నాలివ్వలేను. కానుక లివ్వలేను. ముద్దుమురిపాలు తీర్చలేను. పండుగనాడు పప్పూ అన్నమూ అయినా సరిగ్గాపెట్టలేను. నాపిల్లని నీకిస్తున్నాను. అందం లేకపోయినా, తెలివితేటలు లేకపోయినా, మేనమామకూతురుగనక అభిమానించుకొని, నాచిట్టితల్లిని (బంగారమ్మచేతిని పేరుభట్టుచేతిలో వుంచి) అన్నయ్యగారూ! ఆశీర్వదించండి.

ప్రకాశం—సర్వేశ్వరుడు ఈనూతనదంపతులికి సకలసంపదలూ సమకూర్చుగాక. అక్కయ్యగారూ! ఈశుభసన్నివేశాన్ని యింతటూకీగా ముగించకూడదు. మీవోదిన్ని తీసుకువస్తాను. తాంబూలాలు యిప్పుడే అయిపోవాలి.

కాంతమ్మ—అలాగే చెయ్యండన్నయ్యగారూ!

పేరుభట్టు—అవకాశంవుంటే చెప్పండి బాబుగారూ! నాస్నేహితుల్ని పిలుచుకునివస్తాను. రెండు గంటలు వ్యవధివుంటే అన్నీ సక్రమంగా జరిగించవచ్చు.

కాంతమ్మ—ఆలోచించండన్నయ్యగారూ!

ప్రకాశం—పంచాంగంచూసి చెబుతాను. (గోడనున్న పంచాంగంతీసిచూసి) బాగుంది. సాయంత్రం ఆరున్నరగంటలవేళ అమృతఘడియలు వస్తాయి. అప్పుడు ముహూర్తంకూడా రాసివుంది. యీలోపుగా తరవాయిలన్నీ తీర్చుకోవచ్చు. పేరుభట్టుగారూ! మీరు వెళ్లి అదేదోచూడండి.

పేరుభట్టు—చిత్తం. (కాంతమ్మకీ, ప్రకాశానికీ పాదాభివందనంచేసి వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—బజారుకివెళ్లి జామారుకూడా తేస్తారా అన్నయ్యగారూ?

ప్రకాశం—అలాగేతెస్తాను. ఈలోపుగా మీరు కోడలికి అభ్యంగనం చేయించండి. పేరుభట్టుగారికి మాయింటో చేయిస్తాను. మరి వెళ్లివస్తాను. (వెళ్లిపోతాడు)

కాంతమ్మ—గావేతల్లీ! (బంగారమ్మచెయ్యి పట్టుకొని యింటోకి తీసుకువెడుతుంది.)

ఆరోఅంకం

మొదటిరంగం

[భద్రయ్యబస. పేరుభట్టు రెండుచేతులతోటీ ద్వారబంధపుకమ్మిలు పట్టుకొని యివతలే నుంచుని వుంటాడు. భద్రయ్య వొకకండువాకోసం రైలుసంచీ తిరగవేస్తూవుంటాడు.]

భద్రయ్య—ఆవేళ నువ్వు నన్ను కొట్టినంతగా సకలహంగామా చేశావు; కాని చివరికి నామాటే నిరుకయింది చూశావా?

పేరుభట్టు—నీకు పరేంగితజ్ఞానం యింతగా వుందన్నమాట.

భద్రయ్య—ఇంకా వొప్పుకోవాయేమిటి?

పేరుభట్టు—ముమ్మాటికీ వొప్పుకోను. నువ్వు ఆవేళ ఆమాట అనడం చాలాతప్పు. అప్పుడు నాస్థితి యెంతసున్నితంగా వుండిందో యిప్పటికికూడా నీకు బోధపడలేదు. ఇక కట్టిపెట్టు ఆప్రస్తావన.

భద్రయ్య— నేను కట్టిపెట్టను. అప్పుడు నే నామాటే అనివుండకపోతే మీఅత్తకి బంగారాన్ని నీకివ్వాలనే ఆలోచనే కలక్కపోవును. ఈసంగతి నువ్విప్పటికికూడా గ్రహించలేకపోయావు. (ఒకకండువా తీసుకొని రైలుసంచీతాళం వేసేసి) అంతా నీప్రయోజకత్వంవల్లనే నెరవేరుతోందని గర్విస్తున్నావుకాబోలు పాపం. వేషాలు చాలించు.

పేరుభట్టు—అంటే యీసమ్మంధం నువ్వే—

భద్రయ్య—నేనే కుదిర్చానని ఘంటాపథంగా చెప్పవచ్చు; చెప్పగలనుకూడానూ. సందేహమేం?

పేరుభట్టు—సెబాస్! చాలా సంతోషించాను. అయితే యీకార్యంకూడా నువ్వేగట్టెక్కించి యీమాట కూడా తక్కించుకో.

భద్రయ్య—నువ్వలాకోరుతూవున్నపుడికఆలోచనకూడా యెందుకూ? చూసుకో యెంతదర్జాగా—అంటే—

పేరుభట్టు—డబ్బుకూడా మాటతక్కిస్తివా—

భద్రయ్య—తక్కిస్తునా, తక్కించి చూపిస్తునా?...... ఎందుకూ? (కండువా జందెప్పేట్టుగా వేసుకొని సవరించుకొంటాడు.)

పేరుభట్టు—తక్కించినంత మాట అన్నావు. అంతేచాలు. ఈనాలుగురోజులూ నాకూడా తిరిగితివావసూలయినసొమ్మంతా నువ్విచ్చినట్లే జమ.

భద్రయ్య—అయితే, దానికి ఖర్చుపద్దుకూడా చెప్పూ, అదెలావుంటుందో విందాం.

పేరుభట్టు—"దంపతుల వివాహ మహోత్సవ సమయమందు బ్రహ్మశ్రీ—

భద్రయ్య—ఆ! ఆ! కొంచెం వుండూ. (ఆలోచిస్తాడు)

పేరుభట్టు—పోనీ మహారాజశ్రీ—

భద్రయ్య—ఏదీ రెండూ కలుపూ.

పేరుభట్టు—బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ—

భద్రయ్య—వూరుకుంటావేం?

పేరుభట్టు — బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ, శ్రీయుత—

భద్రయ్య—(చెయ్యిజాడిస్తూ) బ-లే బ-లే!

పేరుభట్టు—వేమూరి భద్రయ్యఅనే భద్రాద్రి రామచంద్రశాస్త్రి పంతులు మహాశయుడుగారు వధువుకి కంఠాభరణం నిమిత్తమూ, వరుడికి హస్తాంగుళ్యాభరణం నిమిత్తమూ—

భద్రయ్య—ఏం? మొత్తం చదివేసెయ్యవోయ్!

పేరుభట్టు—అది నువ్వు తేల్చిందే.

భద్రయ్య—అయితే, యింతవరకూ వచ్చాక యిక చచ్చేందుకూ? వెయ్యిన్నూటపదహార్లు అనేసెయ్యి.

పేరుభట్టు—ఔదార్యం అంటే అలావుండాలి. నిజంగా చేతిలో డబ్బున్నవా డింతమాట అనగలడా?

భద్రయ్య—అనగలడా కాదు. ఎవరేనా అంటే కూడా వినగలడా? అను.

పేరుభట్టు—వహవ్వా!.....పురాణధోరణిలో పడ్డాక సమయస్ఫూర్తి యెలా హెచ్చవుతోందో చూశావా?

భద్రయ్య — అదంతా నీచలవే. మరి నేను తయారూ.

పేరుభట్టు—నే సరుగే దిగాను.

(ఇద్దరూ గదిదాటి యివతలికి వస్తారు. భద్రయ్య గదికి తాళం వేసి శకునం చూస్తాడు.

పేరుభట్టు—చూడ నక్కర్లేదు. పూర్ణకుంభ ద్వయం!

భద్రయ్య—వా! నెత్తిమీదిబిందెలు తొణక్కుండా మహాఠీవిగా నడుస్తున్నారోయి నాయకు పిల్లలూ. జేబు నిండిందన్నమాటే యివాళ. చూస్తావేం. అడుగువెయ్యి ముందుకి.

పేరుభట్టు—యశ్శివో నామరూపాభ్యాం—

భద్రయ్య—యాదేవీ సర్వమంగళా.

పేరుభట్టు—తయో స్సంస్మరణా త్పుంసాం—

భద్రయ్య, పేరుభట్టున్ను — సర్వతో జయ మంగళమ్.

(ఇద్దరూ గుమ్మందిగి వెళ్లిపోతారు)

రెండో రంగం

[కాంతమ్మయింటో పేరుభట్టు గది. జేబులో వున్న మూట తీసి, విప్పి, అందులో ఉన్న రూపాయలు చిక్కంలో పోస్తాడు.]

పేరుభట్టు— (స్వగతం, గర్వంతో) పేరుభట్టంటే రాజమహేంద్రవరంలో యింత గణ్యతఉందా? మూడురోజుల పూటకీ నాలుగువందలయెనభైరూపాయలు వసూలా? చెట్టు దులిపినట్లే. పాతికరూపాయలు లిగాడుపద్దూ. యాభైలు సర్వసామాన్యం. పెద్దమెట్టు నూటపదహార్లు. ఇంకో అయిదారువందలకి తక్కువ వస్తాయా?......సన్నాయి అలాగా, భోగంమేళం అలాగా యేర్పాటయిందికదా? భేష్! ఇంకేం? ఫరవా లేదు. పెళ్లి సలక్షణంగానే జరుగుతుంది. (చిక్కం సూటుకేసులో వుంచి) అత్తకి నేను సంపాదిస్తున్నానని తెలుసు. కాని పరిమితి తెలవదు. ముందుముందు నేను బాగా సంపాదించగలననీ, సంసారం లోటు లేకుండా నిర్వహిస్తాననీ అనుకొంటూనే వుంది; కాని యిదివరకే బాగా జాగ్రత్తపడ్డానని బాగా యెరగదు. మన ప్రయోజకత్వం వొక్కమాటు ఆవిడికి చూపించాలి. కనక పొట్టంకూడా పైకితీద్దాం. (ట్రంకుఅడుగునుంచి వొకపొట్టం తీసి తూచడం అభినయిస్తూ) మహాలక్ష్మి! తెల్లవారి లేచి రోజూ వొక్కమాటు మొక్కితే యెక్కడికి వెళ్లినా యింత అన్నం దొరుకుతుంది. (రెండు చేతులతోటీ పట్టుకొని కళ్లకద్దుకొని) బంగారం యిప్పటిదాకా బావ బాగా పాడతాడనీ, అందంగా ఉంటాడనీ, సుఖపెడతాడనీ సంతోషిస్తూనేఉంది. అయినా ఆబావ వొట్టొట్టిబావ కాడని ఆమెకికూడా తెలియచెయ్యాలి. ఈపొట్టం చూసిందంటే ఆమె పొంగిపోతుంది. (ఆపొట్టంకూడా సూటుకేసులో పెట్టి మీటు నొక్కి, ట్రంకుతాళం వేసి సూటుకేసు పుచ్చుకొని బయలుదేరతాడు.)

(హాలు, మేడమీదనుంచి వస్తూ బంగారం కూడా పేరుభట్టులాగే అప్పుడే హాలులో అడుగుపెట్టి, పేరుభట్టుని చూసి సిగ్గుచేత వెనక్కి జంకుతుంది; కాని పేరుభట్టు ఆమెని గభీమని రెక్కపట్టుకొని బల్లదగ్గిరికి తీసుకువెళ్లి, సూటుకేసు బల్లమీద పెట్టి ఆమెని కాళ్లతో పెనవేసి బల్లమీద కూచుంటాడు. బంగారం విడిపించుకోడానికి ప్రయత్నిస్తూవుంటుంది. కాని చాలా సున్నితంగానే పెనగులాడుతుంది.)

పేరుభట్టు—(ఆమెమొగంమీద మొగంపెట్టి) ఏం? నీకూ నాకూ మాటలు లేవూ?

బంగారమ్మ—(తల వంచుకొంది. ఆనందం మొగంఅంతా ఆవరించివుంది; కాని మాట్లాడదు.)

పేరుభట్టు—(మెల్లిగా) ఇక్కడ యెవరూ లేరులే. దూరాన్నుంచేనా యెవరూ చూడ్డం లేదు. ఇలాచూడూ. (గడ్డంకింద చెయ్యిపెట్టి మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(వెళ్లిపోడానికి చేసే ప్రయత్నాలు మానేస్తుంది. కదలదు; కాని కళ్లు మూసుకుంటుంది.)

పేరుభట్టు—మొగం పైకెత్తితే కళ్లుమూసుకుంటుం దేమిటో? (కళ్లమీదవూది) ఏం? ఈమాటు ఏం చేస్తావూ?

బంగారమ్మ—(చూడదు. కదలదు.)

పేరుభట్టు — చక్కలిగిల్లి పెడితే యేం చేస్తావూ? (పెడతాడు.)

బంగారమ్మ—(అతని చేతుల్లోనే యెగిరెగిరి పడుతూ గునుస్తూ) చూడవే అమ్మా!

పేరుభట్టు—మీఅమ్మ వచ్చి యేంచేస్తుందేమిటి నన్ను? బుద్ధిపూర్వకంగా నిన్ను మీఅమ్మే యిచ్చేసిందినాకు. మునపటిలాగ నేనిక జంకుతానను కున్నావేమో? మాచెల్లెలి నప్పగించానంటే అది పెళ్లయి అత్తారింటికి వెళ్లేదాకా ముక్కు నేలబెట్టి రాసేస్తుంది. కనక యిలాచూడు. వోమాటు చూడు. ఏదీ? కొంచెం. ఇంకా కొంచెం. (మెల్లిగా మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(మళ్లీ బాగా కళ్లు మూసేసుకుంటుంది. నవ్వు వస్తోంది. కాని అణుచుకొంటుంది. అయినా పెదిమెలు విడతాయి. దంతాలు కొంచెం కనపడతాయి.)

పేరుభట్టు—నవ్వుతోంది. వచ్చేస్తోంది. పెదిమెలచివరికి వచ్చేసిందికూడానూ. దొంగా! అణుచుకొంటున్నావా? ఏదీ? (గడ్డంపట్టుకొని బతిమాలుతూ) పైకి రానిచ్చెయ్యి. వొక్కమాటు. వొక్కక్షణం.

బంగారమ్మ—(మొగం వంచుకొంటుంది. అప్పుడు కాంతమ్మ వచ్చి మాట్లాడకుండా నవ్వుతూ లోగుమ్మంలో నుంచుంటుంది. పేరుభట్టు అది కనిపెడతాడు; కాని చూడనట్టే వుంటాడు.)

పేరుభట్టు—(బంగారమ్మ మొగం పైకెత్తుతూ) మామయ్యకూతురవుగా మాత్రమే వున్నప్పుడు 'బావా, బావా' అంటూ యేమీ తోచనిచ్చేదానవుకాదు. పెళ్లయాక యేంవొరగతోస్తావో కాని యిప్పుడు మాట్లాడం, చివరికి కళ్లతోచూడ్డమే మానేశా వేంపుణ్యమే? పేరుకాకుండా పలుకే బంగారం అయిపోయిం దేమిటే కుందనబ్బొమ్మా!

కాంతమ్మ—జవాబు చెప్పమ్మా! తప్పుకాదూ? (బంగారమ్మ వులిక్కిపడుతుంది; కాని అలాగేనుంచుంటుంది)

పేరుభట్టు—చూశావా అత్తా నీకూతుర్ని? క్షణంలో యెంత పెంకితనం వచ్చిందీ దీనికీ? ఇలా అయితే కష్టమే. బతిమాలడం నాచేతకా దేమనుకున్నావోగానీ. చిలకలాగ కులుకుతూ, హంసలాగ తక్కుతూ, పావురంలాగ తారుతూ చలాకీగా వుంటేగాని నాకు పనికిరాదుమరి.

కాంతమ్మ—సిగ్గుపడకమ్మా! మునపటి పేరుభట్టుబావేకదుటే? కొత్త యేంవచ్చిందీ యిప్పుడూ? తిన్నగా కూచోతల్లీ వొళ్లోను.

బంగారమ్మ—(పలకదు. కదలదు)

పేరుభట్టు—ఇలా కాదు ఉండవమ్మా అత్తా! ఇక వొట్టొట్టిమాటలు పనికిరావు కాబోలు నీకూతురికి. ఏదీ? ఆపెట్టి—పోనీ నన్నందుకోనియ్యి.

(పేరుభట్టు పెట్టె దగ్గిరికితీసుకొని తెరుస్తాడు. బంగారమ్మ వోరకంట చూస్తూ నుంచుంటుంది. కాంతమ్మ మహానందపడుతూవుంటుంది.)

పేరుభట్టు—అత్తా! నీకు చూపించడానికి నా దగ్గిర యేమీ లేదు; గాని—అయినా పెళ్లన్నాక పూరికే కాదుకనక—

కాంతమ్మ—ఇప్పు డెందుకోయి? కాకపోయినా నాకు చూపించే దేమిటి?

పేరుభట్టు—అలా కాదు. ఇంటిదగ్గిర నాకున్న ఆస్తి నీకు తెలవంది కాదు. అది నాకు తక్కుతుందని యేమీ ఆశ లేదు. ఇక నాకు రెక్కలే ఆధారం.

కాంతమ్మ—మీ తాత మాకూ రెక్కలే ఆధారం చేశారు. అయినా రాజమహేంద్రవరం ప్రవేశించాక మా కేమీ లోపం రాలేదు. రెక్కలు చల్లగావుంటే యిక లేనిదేమిటి నాయనా?

పేరుభట్టు—నే నలాగే ధైర్యం చెప్పుకొంటున్నాను. నీ ఆశీర్వచనంవల్ల నాకు సంగీతంలో కొంచెం పేరువచ్చింది. సాహిత్యంలోకూడా బుద్ధి ప్రసరిస్తోంది. దేవుడు మేలుచేస్తే నా కేమీ లోటుకలగకూడదు. కాని చదువుచూసుకొని మురుస్తూకూచుంటే సంపాదన—

కాంతమ్మ—నీసంపాదన నాకు తెలుస్తూనే వుంది. ఒక్కసంవత్సరంలో బంగారానికి నూటయాభై రూపాయలు ముట్టచెప్పావు. నీదగ్గిర యెంతా లేకపోతే అంత యివ్వగలవూ?

పేరుభట్టు—ఏవీా లేనివా డేమీా యివ్వ లేడు. నిజమే; కాని నేను బంగారాని కిచ్చింది యేమంత గొప్పా? బంగారం నామీాద చూపిస్తూవున్న దయకి నేను చేసినసేవ యేం సరిపోతుందీ? కాకపోయినా అదలావుండనియ్యి. రెండేళ్లయింది నాకు పెళ్లిచేసుకోవాలని సంకల్పం కలిగి. ఇప్పుడు కాకపోతే మరోకప్పుడేనా మావాళ్లు నాపెళ్లికోసం ప్రయత్నం చేస్తారు. మాఅమ్మతో తాసికలు చెప్పి మాచిన్నన్నయ్య నా పెళ్లి పడగొడితే పడగొట్టావచ్చుకూడాను.

కాంతమ్మ—ఎంతెంతవిరోధా లుండినా అన్నదమ్ము లంతంతద్రోహం చేసుకుంటారా నాయనా?

పేరుభట్టు—కాకపోయినా జ్ఞానం వచ్చాక, యేదో ప్రయోజకత్వంకూడా కాస్త కలిగాక నాపెళ్లి భారం మరొకళ్లమీాద యెందుకు వెయ్యాలీ.

కాంతమ్మ—అదీ మాట. ప్రయోజకుడిలక్షణం అదీ.

పేరుభట్టు — పెళ్లిమీాద దృష్టికలగడంతోటే బాగా ఆలోచించాను. పిల్లనిచ్చేవా ళ్లేంచూసియిస్తారు? పెళ్లాం వచ్చాక యేమిటి తినడం? తీరా అప్పుడు ప్రయత్నంచేస్తే డబ్బురావడం యెలాగ? ఇలాఆలోచించాటప్పటికి అంతా అయోమయంగా కనపడింది.

కాంతమ్మ—అంత ముందుచూపు యీాకాలంలో యేపిల్లాడి కుందీ?

పేరుభట్టు—ఉండకపోతే తరవాత బోల్తాపడతాడు. పెళ్లాం తమలపాకులు తెమ్మంటే "మాఅమ్మనడిగి డబ్బుతెస్తా" నండు అనాలి.

కాంతమ్మ—బాగా చెప్పావు.

పేరుభట్టు—అంచేత అప్పుడు పెళ్లిమీాదికి పోయినదృష్టిని డబ్బుమీాదికి మళ్లించాను. అందుకు ఫలితంగా యిదిగో యీాకాసులు (పొట్లం విప్పిచూపిస్తూ) సంపాదించాను. ఇవి అరవైమూాడు. కాసుపదమూాడు—పద్నాలుగురూపాయలకోవున కొన్నాను.

బంగారమ్మ—(కాసులకేసి వోరకంటచూస్తుంది.)

కాంతమ్మ—కాసులికి దణ్ణంపెట్టవే బంగారం.

బంగారమ్మ—(ఊరుకుంటుంది.)

కాంతమ్మ—చూసి వూరుకోగూడ దమ్మా, పోనీ కళ్లకద్దుకో.

బంగారమ్మ—(గునిస్తిగునిసి నమస్కారంచేసినట్లు కాసులకేసిచూస్తూ, శిరస్సు వంచుకొంటుంది.)

కాంతమ్మ—నోట్లో ముక్క వున్నవాడవు. నీ కేంలోటు నాయనా?

పేరుభట్టు—ఇవి రూపాయలు. పాంతికతక్కువ నాలుగువందలు. ఆకాసులతో నగలూ, యీారొక్కంతో ఖర్చులూ సరిపెట్టా లనుకొంటున్నాను.

కాంతమ్మ—చేతిలోవుంటేమాత్రం వున్నవన్నీ ఖర్చుచేసుకొంటే—మనం జమీాందార్లముటోయి?

పేరుభట్టు—ఇది పూర్వపుసంపాదన. నీకు నామీాద అనుగ్రహం కలిగిన తరవాత—అంటే బంగారాన్ని నా కిస్తా నన్నతరవాత మూడురోజులపూటలోనూ సంపాదించిన వివీ. (ఇంకోమూటవిప్పి బల్లమీాద పెడతాడు.)

కాంతమ్మ—నీకు అడ్డేమిటోయి? ఎక్కడికి వెళ్లినా యెలాంటివాళ్లనీ కూడా నువ్వు క్షణంలో లోపుచేసుకోగలవు.

పేరుభట్టు—ఇవి నాలుగువందల యెనభైరూపాయలు.

కాంతమ్మ—బాగుంది నాయనా!

పేరుభట్టు—ఇంకా ఆరువందల చిల్లరవాగ్దానా లున్నాయి. మంగళసూత్రమూ, ప్రోల్లో పెట్టవలసిన

పట్టుచీరా వొక జమీందారుగా రిస్తామన్నారు. వారిది వరకి—అంటే మొన్న సాయంత్రం నూటపదహార్లిచ్చారు.

కాంతమ్మ—ఎంతధర్మాత్ములోయి వారూ ?

పేరుభట్టు—పెళ్లి వారిపెత్తనంమీదే జరుగుతుంది.

కాంతమ్మ— ఆహా! సరసం అంటే అలా వుండాలి.

పేరుభట్టు—ఇంకా చాలామంది బట్ట లిచ్చేవారున్నారు. ఇవి యిలావుండగా : వేంకటరాముడు గురుదక్షిణగా తనజట్టుతో వచ్చి అయిదురోజులూ—గృహప్రవేశం అయిందాకా సన్నాయి వాయించివెడతానన్నాడు. తనతమ్ముణ్ణి ఫిడేలువాద్యంలో తయారు చేసినందుకు సంతోషంగా పరంజ్యోతి తనమేళంతో వచ్చి ఆరురోజులూ మేజువాణీ చేస్తానంది.

కాంతమ్మ—నీవన్నీ జమీందారీయెత్తులు. నీకు నే నేమి ముచ్చట్లు తీర్చగలనూ ? మీమామయ్యవుంటే నీప్రయోజకత్వంచూసి పొంగిపోదురు. పిల్లా, నేనూ పెట్టిపుట్టలేకపోయాం. (కళ్లు తుడుచుకొంటుంది.)

బంగారమ్మ—(కళ్ల నీళ్లు పెట్టుకుంటుంది.)

పేరుభట్టు—(గద్గదికతో) ఆ మరదృష్టంఅంతా నాదీ. మామయ్యఆసరా చూసుకొని నే నెన్నోకల్పనలు చేసుకొన్నాను. అన్నీ గాలిమేడ లయిపోయాయి

(వొక్కక్షణం యెవరూ మాట్లాడలేకపోతారు.)

కాంతమ్మ—పదిమాట్లు చెప్పడం యెందుకు నాయనా? నాబిడ్డకేనా, నాకేనా నువ్వే ఆధారం. నన్ను వొక్కకడుపున పుట్టిన తమ్ముడులాగ చూస్తున్నావు నువ్వు.

పేరుభట్టు—ఎదటివాళ్లని త నెలాచూస్తే ఆయెదటివాళ్లు తన్నలాచూస్తారు. నన్ను నువ్వు తోడబుట్టినవాణ్ణిలాగ చూసి, నేను నిన్ను తోడబుట్టినపడుచుని చూడవలసినట్లు చూసేలాగ చేశావు. ఇందులో నావిశేషం యేమీలేదు. అదలావుంకనియ్యి. కష్టం వచ్చినా, సుఖంవచ్చినా సంసారంలో యేదీ నిలిచిపోదు—

కాంతమ్మ—ఏం అడ్డింది నాయనా! పెనిమిటిపోయినా కూతురికి పెళ్లిచెయ్యడం తప్పిందికాదునాకు.

పేరుభట్టు—అది అంతాయింతాలోటా ? ఈశ్వరుడేనా తీర్చలేని దది.

కాంతమ్మ—అంతా 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' చేసుకోవాలి.

పేరుభట్టు—అంతే మరీ......ఇక చెప్పవలసిందేమీలేదు. పెళ్లిపేరు చెప్పి యింకా చాలాసంపాదించగలనని ధైర్యం వుంది. అది యెలావున్నా, ముందీకాసులికి సరిపడేనగలికి పురమాయిద్దాం. ఏంబంగారం! ఏంకావాలి నీకూ ? నీయిష్టం వచ్చిన నగలు చేయించమంటావా, నాయిష్టంవచ్చినవా ? కాసులు చూపించినా మాట్లాడకపోతే యింకెలాగా మరీ ? వొక్కమాటు—నాకేసి కాదులే. ఈకాసుచూడూ. (మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(కళ్లు మూసుకుంటుంది. ఆనందం మొగంఅంతా కమ్మి వుంటుంది.)

కాంతమ్మ—సమాధానం చెప్పు తల్లీ! అత నంతగా బతిమాలేటప్పుడు మాట్లాడకపోతే మోటతనం అనిపించుకోదూ ?

పేరుభట్టు—ఇదివరకి నేను వుత్తొత్తి బావనే. ఇప్పుడు తాళికట్టబోతున్నాను కనక బతిమాలించుకోవాలి. ఆడపిల్లలికి యెలావస్తుందో యీగడసరితనం ఆశ్చర్యం కలుగుతుంది.

కాంతమ్మ—నేనుకనుక్కుంటానులే నాయనా!

పేరుభట్టు—అలాగే చెయ్యి. అది లోకధర్మం కనక అలా వూరుకుంది. కాని బంగారానికి నామీద దయలేదా. అది నే ననుభవించలేదా ?

కాంతమ్మ—దయవున్నా ప్రేమవున్నా నీకే వుంది. చంటిపిల్ల, దానికేంతెలుసును నాయనా ? లోట్లన్నీ నువ్వే సర్దుకోవాలి.

పేరుభట్టు—లోట్లంటూ వుంటే, నువ్వు వుండ నిస్తే సద్దుకోవలసిందే. లేకపోతే సంసారా లెలా నెగ్గుతాయీ? ఇంతకీ: నావల్లమాత్రం లోట్లు రాకుండా వుంటాయా? ఇక నాకు వేళ అవుతోంది. సబుకలెక్టరుగారు ఇవాళ విందుచేసి బహుమతి యిస్తారు. అప్పుడే తొమ్మిది దాటింది. తొరగా వెళ్లాలి.

కాంతమ్మ—వెళ్లిరా నాయనా!

పేరుభట్టు—కాసులూ, రూపాయలూ జాగ్రత్త చేయించు.

కాంతమ్మ—నీదగ్గిర దాచవోయి!

పేరుభట్టు—నాదగ్గిరెందుకూ? నాదగ్గిర వున్నదీ, నీదగ్గిర వున్నదీకూడా యిక నీచేతిమీద నడవవలసిందే. (లేస్తాడు.)

కాంతమ్మ—అయినా—

పేరుభట్టు—ఇక మారు చెప్పవద్దు. పూచీ అంతా నీది కాని నాది కాదు. వెళ్లివస్తానే బంగారం! (బంగారమ్మవీపుతట్టి వెళ్లిపోతాడు.)

(బంగారమ్మా, కాంతమ్మా ఒక్కక్షణం గంభీరంగా చూసుకొంటారు.)

కాంతమ్మ—అవిదాచుకోమ్మా!

బంగారమ్మ—ఏమోబాబూ! (వసారాలోకి వెళ్లిపోతుంది.)

కాంతమ్మ—నాకేం. పోనీ అలాగే వుండనిచ్చుకో.

బంగారమ్మ—నీకు కాకపోతే నాకా యేమిటమ్మా పూచీ?

కాంతమ్మ—అవి జాగ్రత్తచేయించమన్నాడు; కాని నన్ను జాగ్రత్త చెయ్యమన్నాడా యేమిటమ్మా నీమొగుడూ?

బంగారమ్మ—(చకితురాలై) అదా యేమిటి అర్థం?

కాంతమ్మ—మ రేదేమిటి?

బంగారమ్మ—(తీక్ష్ణంగా చూస్తుంది.)

కాంతమ్మ — (మందహాసంతో నిదానంగా చూస్తుంది.)

బంగారమ్మ—నువ్వు దాచగూడదా యేమిటి?

కాంతమ్మ—నువ్వు దాచమనగూడదాయేమిటి?

బంగారమ్మ—(గునుస్తూ) ఇవి దాచండీ అమ్మగారూ!

కాంతమ్మ—(కళ్లు తిప్పుకుంటూ) గదిలోకి పట్టుకురండీ రాణీగారూ!

బంగారమ్మ—ఇదుగో తెస్తున్నానండీ.

కాంతమ్మ—ఇనప్పెట్టి తాళాలుగూడా తీసుకురండీ.

బంగారమ్మ—నిమిషంలో తెస్తా నివి పుచ్చుకోండీ.

కాంతమ్మ—నే నిప్పుడు యినప్పెట్టి ముట్టుకోను, యెలాగండీ మరీ?

బంగారమ్మ—చూశావా? (గునుస్తుంది.)

కాంతమ్మ—చూస్తున్నావా?

బంగారమ్మ—(ఆలోచిస్తూ పైకిచూస్తుంది.)

కాంతమ్మ—(ఓరచూపులు చూస్తూ వూరుకుంటుంది.)

బంగారమ్మ-(తల్లి కేసి నిదానంగా చూస్తుంది.)

కాంతమ్మ—(తనలో) ఏమీ తోచడం లేదు మాఅమ్మకి. మన స్నేంత కొట్టుకొంటోందో? అయినా నొక్కక్షణం—

బంగారమ్మ—(బతిమాలుతూ) దాచిపెట్టవూ టే అమ్మా?

కాంతమ్మ—(తటాలున ఆమెని పొదివిపట్టుకొని) మా మ్మే! మాతల్లే! ఇప్పటికి తోచిందా అమ్మా? దాచిపెడతానమ్మా! నా కింతకంటే మరోప నేంవుందమ్మా?

బంగారమ్మ—అయ్యో! నీమడి—

కాంతమ్మ—అయితేలే తల్లీ! నువ్వెక్కవా నాకు మడి యెక్కవా? (ఆమె నెత్తుకొని) నాచిట్టి తల్లి యీకాసులతో నగలు చేయించుకొని, అవన్నీ పెట్టుకొని వొయ్యారంగా మసులుతూవుంటే నా కింక నిద్రయెందుకు, ఆహారం యెందుకు? అంతకంటే నాకు మ డేమిటి, పుణ్యం యేమిటి? నా అదృష్టం మంచిది. కనక నాతల్లికి మంచిమొగుడు దొరికాడు. మా అమ్మకి తండ్రియిచ్చినమేడలో మొగుడు కాసులూ, రూపాయలూ రాసులుపోస్తాడు. (ఆమెని ముద్దుపెట్టుకొని) అవునా నాకూనా?

బంగారమ్మ — (ఆనందంతో తల్లిని గట్టిగా కౌగిలించుకొంటుంది.)

కాంతమ్మ — (ముద్దుగా) నీ మొగుడుపేరు చెప్పవూ తల్లీ!

బంగారమ్మ—(తల అడ్డంగా వూపుతుంది.)

కాంతమ్మ—వొక్కమాటు చెప్పమ్మా!

బంగారమ్మ—ఊఁ ఊఁ! (గునుస్తుంది.)

కాంతమ్మ—నాచిట్టితల్లివికామా? (బతిమాలుతుంది.)

బంగారమ్మ—పెళ్లిలో చెప్పిస్తారుకాదా యేమిటమ్మా?

కాంతమ్మ—అప్పటిదాకా వూరుకూ కూచోమంటావా?

బంగారమ్మ—వులకం!

కాంతమ్మ—కాకపోయినా అప్పుడు నేను నలుగురిలోకీ వచ్చి నుంచుంటానా యేమిటమ్మా?

బంగారమ్మ—(తల్లి చెవిలో నోరు పెట్టి పెదిమలు కదుపుతుంది.)

కాంతమ్మ—పెదిమలు కదిపావు. చెవులు వింటాయి గాని చూస్తాయిటే మాతల్లీ?

ంగారమ్మ—(మళ్లీ చెవిలో నోరుపెట్టి కాస్తబ వినపడీలాగ చెబుతుంది.)

కాంతమ్మ—సరిగా వినపడలేదమ్మా!

బంగారమ్మ—(చెవిలోనే యింకాస్త గట్టిగా చెబుతుంది.)

దేకాంతమ్మ—వొక్కచెవికే వినపడింది. ఇమిటే మామ్మా యింతబతిమాలించుకొంటావూ?

బంగారమ్మ— (చెవిలోనే గట్టిగా) పేరుభట్టు భావ!

కాంతమ్మ—మామ్మే! మాతల్లే! నాచిన్నారి నామాట తీసెయ్యదు. నేను చెప్పింది కాదనదు. చాలమ్మా! బ్రహ్మానందం అయింది. కాని యిక 'బావ' అని తుంచేసి పలకగూడదమ్మా!

బంగారమ్మ—(తల్లిచెవికేసి నోరుపెట్టి కొంచెం నింపాదిగా) పేరుభట్టు బావగారు. (గట్టిగా) ఏం? బాగుందా?

కాంతమ్మ — నిక్షేపంలా వుంది. అమృతంలాగకూడా వుంది. పెళ్లిలోకూడా యిలాగే ఝాంకారంగా చెప్పెయ్యమ్మా!

బంగారమ్మ—ఇకదింపుమరి, తాళాలు తెస్తానూ.

కాంతమ్మ—నువ్వెందుకమ్మా తేవడం? ఇక నిన్ను నడవనిస్తానా నాకొండా? అలా అయితే నేను బతికివున్న లాభం యేమిటమ్మా? (ఆమెని మాటిమాటికీ వళ్లానికి అదుముకొంటూ, ముద్దుపెట్టుకొంటూ గదిలోకి వెడుతుంది.)